ప్రజాశక్తి
శుక్రవారం 25 అక్టోబర్ 2024
5
పార్వతీపురం మన్యం



డిఇఒగా ఎన్‌టి నాయుడు

ప్రజాశక్తి - పార్వతీపురం



మన్యం జిల్లా విద్యాశాఖాధికారిగా ఎన్‌టి నాయుడును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విజయనగరంలోని డైట్ కళాశాలలో సీనియర్ లెక్చరర్ పనిచేస్తున్న నాయుడుకు పూర్తి అదనపు బాధ్యతలతో జిల్లా విద్యాశాఖాధికారి గా నియమించారు. ఇంతవరకు డిఇఒగా ఉన్న జి.పగడాలమ్మను ఆ బాధ్యతల నుంచి రిలీవ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

బడిదేవర కొండపై టిడిపి, వైసిపి దొందూ దొందే



- మొదటి నుంచీ వ్యతిరేకిస్తున్నది వామపక్షాలే
- ప్రకటనలకే పరిమితమవుతున్న జనసేన
- గిరిజనుల పట్ల పాలక పార్టీల నిర్లక్ష్యం

ప్రజాశక్తి - పార్వతీపురం

మండలంలోని బడిదేవరకొండపై అధికార, ప్రతిపక్ష పార్టీల వైఖరి దొందుదొందే అన్న చందంగా తయారైంది. గ్రానైట్ కొండ చుట్టూ ఉన్న పది గ్రామాల ప్రజలకు నష్టం జరుగుతున్నా తమకు కార్పొరేట్ ప్రయోజనాలే ముఖ్యమనే ధోరణితో పాలక పార్టీలు వ్యవహరిస్తున్నాయి. 2016లో బడిదేవర కొండపై గ్రానైట్ తవ్వకాలకు లైసెన్స్ పొందిన ఆ భూమి రిజర్వ్ ఫారెస్ట్‌దని అధికారులు తేల్చడంతో ఆ లైసెన్స్‌ను రద్దు చేశారు. టిడిపి ప్రభుత్వ హయాంలోనే గ్రానైట్ తవ్వకాలకు మంజూరైన అనుమతులు రద్దయ్యాయి. ఇప్పుడు మళ్లీ అదే టిడిపి ప్రభుత్వ హయాంలో రద్దు చేసిన లైసెన్స్ పునరుద్ధరణ జరిగింది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు టిడిపి బడిదేవరకొండ తవ్వకాలను వ్యతిరేకించింది. ఇప్పుడు మాత్రం అనుమతులు మంజూరు చేసిన కూటమి ప్రభుత్వం గిరిజనుల ప్రయోజనాలను గాలికొదిలేసింది. అధికారంలో, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వైసిపి మాత్రం ఈ వ్యవహారంపై మౌనం వహిస్తోంది. ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్నా గిరిజనుల ప్రయోజనాల కోసం పోరాడడం లేదు. గత కొంతకాలంగా వామపక్షాలు, గిరిజన సంఘాలతో కలిసి పోరాడుతున్నా వైసిపి మాత్రం తమకు సంబంధం లేని వ్యవహారమనే వైఖరి అవలంభిస్తోంది.

ఆది నుంచీ వ్యతిరేకిస్తున్నది వామపక్షాలే

గిరిజనుల ప్రయోజనాలే లక్ష్యంగా మొదటి నుంచీ పోరాడుతున్నది వామపక్షాలే. వీటితో పాటు కొన్ని గిరిజన సంఘాలు కూడా చేయి కలుపుతున్నాయి. బడిదేవర కొండపై ఉన్న గ్రానైట్ తవ్వకాల చేసిన కొండ కనుమరుగైతే ఎదురయ్యే దుష్పరిణామాల గురించి పోరాడుతున్న పార్టీలు, సంఘాలు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాయి. సమీప గ్రామాల గిరిజనులతో కలిసి కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేయడంతో పాటు అధికారయంత్రాంగంపై ఒత్తిడి పెంచే ప్రయత్నాలు చేస్తున్నాయి. వామపక్షాలు, గిరిజన సంఘాలతో కలిసి దీనిపై పోరాటానికి కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తున్నారు.

ప్రకటలకే పరిమితమవుతున్న జనసేన

అధికార కూటమిలో ఒకటైన జనసేన బడిదేవకొండ వ్యవహారంలో ప్రకటనలకే పరిమితమవుతున్న పరిస్థితి కనిపిస్తోంది. ఆ పార్టీ నాయకులు ప్రకటనలతో హడావుడి చేసి వెళ్లిపోవడమే తప్ప గిరిజనుల ప్రయోజనాల కోసం పోరాటానికి సిద్ధం కావడం లేదు. కూటమి ప్రభుత్వ హయాంలోనే గ్రానైట్ తవ్వకాలకు లైసెన్స్ పునరుద్ధరణ జరిగింది. అంటే జనసేన పార్టీ భాగస్వామిగా ప్రభుత్వమే ఎంఎస్పి కంపెనీకి అనుమతులు మంజూరు చేసింది. అలాంటి పరిస్థితుల్లో జనసేన నాయకులు గ్రానైట్ తవ్వకాలకు వ్యతిరేకంగా పోరాడుతున్నట్లు నటిస్తూ ప్రకటనలివ్వడం ఆ పార్టీ ద్వంద్వ వైఖరికి అద్దం పడుతోందనే వాదనలు వినిపిస్తున్నాయి.

తవ్వకాలతో ముందుకెళుతున్న ఎంఎస్‌పి

బడిదేవర కొండపై గ్రానైట్ తవ్వకాలతో ఎంఎస్‌పి కంపెనీ యాజమాన్యం ముందుకెళ్తుంది. అధికార, ప్రతిపక్ష పార్టీలు రెండూ తమకు అనుకూలంగా వ్యవహరిస్తున్నాయనే ధీమాతో కొండపై తవ్వకాల పనులు చేపడుతోంది. పరిరక్షణ కమిటీ చేస్తున్న పోరాటాలను నిర్వీర్యం చేసేందుకు కుయుక్తులు పన్నుతోంది. జిల్లా అధికారయంత్రాంగం అండగా ఉండడంతో ఆందోళనకారులను మభ్యపెట్టే ప్రకటనలిప్పిస్తోంది.

ఏనుగుల దాడిలో వృద్ధుడు మృతి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మండలంలో గత 15 రోజులుగా తిష్ట వేసిన ఏనుగులు గుంపు వల్ల ఏ క్షణాన ఏం జరుగుతుందోనని మండల ప్రజల భయాందోళనలు నిజమయ్యాయి. గురువారం పెద్దబొండపల్లి, గదవవలస గ్రామాల మధ్యనున్న తోటల్లో ఏనుగుల గుంపు సంచరిస్తుంది. పెదబొండపల్లికి చెందిన దేవాబత్తుల యాకోబు (74) గురువారం సాయంత్రం ఏనుగులను వీక్షించడానికి గ్రామస్తులతో కలిసి వెళ్లాడు. యాకోబు స్వతహాగా చెవిటివాడు కావడంతో ఏనుగుల అలికిడి వినిపించుకోలేక పోయాడు. అంతవరకు శాంతంగా ఉన్న ఏనుగుల గుంపు హఠాత్తుగా వృద్ధుడిపై దాడి చేయబోగా, ప్రాణాలు కాపాడుకునేందుకు పరుగులు తీశాడు. దీంతో కింద పడిపోయిన యాకోబు కాళ్లను ఏనుగులు తొక్కి గాయపరిచినట్లు స్థానికులు చెబుతున్నారు. వెంటనే స్పందించిన అటవీ శాఖకు చెందిన ట్రాకర్లు, గ్రామస్తులు వృద్ధుడ్ని చికిత్స కోసం హుటాహుటిన జిల్లా కేంద్రాసుపత్రికి తరలించగా, వైద్యులు చికిత్స అందిస్తుండగా ప్రాణాలు విడిచాడు. యాకోబు పెదబొండపల్లి పంచాయతీ కార్యాలయంలో క్లాప్ మిత్రగా విధులు నిర్వహిస్తున్నారు. ఇతనికి ముగ్గురు కుమార్తెలు, కుమారుడు భార్య ఉన్నారు. సంఘటనపై స్పందించిన ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర మృతునికి కుటుంబానికి ప్రభుత్వం నుంచి రూ.10లక్షలు పరిహారం అందజేయనున్నట్లు ప్రకటించారు.

మృతుడి కుటుంబాన్ని ఆదుకుంటాం

ఏనుగుల దాడిలో మరణించిన యాకోబు కుటుంబాన్ని ఆదుకుంటామని అటవీ శాఖ రేంజ్ అధికారి రామ్ నరేష్ బిర్లంగి తెలిపారు. సంఘటన విషయం తెలుసుకున్న ఆయన జిల్లా కేంద్ర ఆసుపత్రిలో ఉన్న వృద్ధుడి మృతదేహాన్ని పరిశీలించి, అనంతరం వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత కొద్ది రోజులుగా మండలంలో ఏనుగులు తిరుగుతున్నాయని అప్రమత్తంగా ఉండాలని గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఆడ ఏనుగు అతనిపై దాడి చేసిన మరుక్షణమే ట్రాకర్లు, అధికారులు ఆటోలో ఆసుపత్రికి తీసుకొచ్చారన్నారు. పజలను అప్రమత్తంగా ఉండాలని, ఏనుగుల గుంపు వైపు ఎవరూ వెళ్లవద్దని కోరారు. అంతేకాకుండా వివిధ గ్రామాల ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సేవా సంస్థలు, ప్రజలు ఇతర అధికారులు కూడా ప్రజల్లో అవగాహన కలిగించడంలో అటవీశాఖకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో అటవీ రేంజ్ అధికారి మణికంఠేష్, అధికారి మనోజ్ కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.10లక్షలు పరిహారం : ఎమ్మెల్యే



యాకోబు మృతదేహాన్ని పరిశీలిస్తున్న రేంజర్ (ఇన్‌సెట్‌లో యాకోబు)

13కు చేరుకున్న మృతుల సంఖ్య

చాలా ఏళ్ల క్రితం జిల్లాలో ప్రవేశించిన ఏనుగులు కురుపాం, పార్వతీపురం నియోజకవర్గాల ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఇప్పటివరకు ఏనుగుల దాడిలో మృతి చెందిన వారి సంఖ్య 12 ఉండగా, తాజా సంఘటనతో 13కి చేరుకుంది. ఈ క్రమంలో విద్యుత్ షాకుతో రెండు ఏనుగులు చనిపోగా, హరి అనే మగ ఏనుగు దారితప్పి ఆచూకీ లేకుండా పోయింది. ఇన్నేళ్లుగా ప్రజలను భయాందోళనలకు గురి చేస్తూ ఆస్తి, ప్రాణ, పంట నష్టాలను కలిగిస్తున్న ఏనుగులను తరలించేందుకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం పట్ల జిల్లా వాసులు తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి ఏనుగుల తరలింపు చేపట్టి, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

రోడ్డు మరమ్మతుకు రూ.3.40 కోట్లతో ప్రతిపాదనలు

ప్రజాశక్తి - పార్వతీపురం

అలికాం - బత్తిలి రహదారి నిమిత్తం సుమారు రూ.3.40కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని సీతంపేట రహదారులు భవనాల శాఖ ఎఇఇ టి.కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల, రోడ్డు పునరుద్ధరణ లేకపోవడంతో కొన్ని చోట్ల రోడ్డు పాడైందన్నారు. రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వానికి నివేదించారు. నిధులు మంజూరైన వెంటనే అలికాం - బత్తిలి రహదారి నిర్మాణం ప్రారంభిస్తామని తెలిపారు. నిత్యం రద్దీగా ఉండే రోడ్డు మరమ్మత్తుల నిమిత్తం సుమారు రూ.60లక్షలు మంజూరయ్యాయని పేర్కొన్నారు. టెండర్లను ఆహ్వానించడం జరిగిందని త్వరలోనే పనులు ప్రారంభిసా_మని ఆ ప్రకటనలో వివరించారు.



పోలీసుల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరిస్తున్న డిఐజి గోపీనాథ్‌శెట్టి

పోలీసు స్టేషన్‌లో డిఐజి ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - బలిజిపేట

స్థానిక పోలీస్ స్టేషన్‌ను విశాఖ రేంజ్ డిఐజి గోపీనాథ్ జెట్టి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పోలీస్ స్టేషన్ ఆవరణంలో మొక్కలు నాటి పర్యావరణం ప్రాధాన్యతను వివరించారు. అనంతరం కార్యాలయంలో రికార్డులను పరిశీలించి పరిష్కారం కానీ కేసులపై శ్రద్ధ నిలిపి పరిష్కార మార్గం వేగవంతం చేయాలని స్థానిక ఎస్సై ఎస్.సింహాచలంను ఆదేశించారు. మహిళలకు, విద్యార్థినిలకు భద్రత కల్పించాలని, పాఠశాలల్లో, కాలేజీల్లో విద్యార్థులకు వివిధ సెక్షన్లపై, నేరాలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని ఎస్ఐ కు తెలిపారు. మహిళా పోలీసుల సహకారంతో సైబర్ క్రైమ్, గొలుసు దుకాణాల నివారణ, నాటుసారా తయారీ వంటి కార్యక్రమాల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలన్నారు. పోలీస్ స్టేషన్ చుట్టుపక్కల ఆహ్లాదకరమైన పర్యావరణాన్ని చూసి డిఐజి సంతృప్తి వ్యక్తం చేశారు. డిఐజి వెంట ఎస్‌పి మాధవరెడ్డి, ఎఎస్‌పి అంకిత సురాన మహావీర్, సిఐ గోవిందరావు, స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నర్సింగ్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులుగా పద్మావతి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ఉమ్మడి విజయనగరం జిల్లా గవర్నమెంట్ నర్సింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షురాలిగా వి.పద్మావతి చంద్రసాయి గురువారం ఎన్నికయ్యారు. ప్రస్తుతం ఈమె పార్వతీపురం జిల్లా ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆమెకు జిల్లా కేంద్రఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.వాగ్దేవి, ఆర్ఎంఒ శ్యామలాదేవి, ఎపి ఎన్జీవో అధ్యక్షుడు కిషోర్, నర్సింగ్ సూపరింటెండెంట్, వైద్యులు, హెడ్ నర్సులు అభినందనలు తెలిపారు.

పారిశ్రామిక పార్కు ఏర్పాటుకు స్థల సేకరణ

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలోని ప్రతి శాసనసభ నియోజకవర్గంలో ఒక ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేసేందుకు ఆలోచన చేస్తున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ పేర్కొన్నారు. ఇందుకోసం అవసరమైన ప్రభుత్వ స్థలాన్ని గుర్తించాలని తెలిపారు. పాచిపెంటలో జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న ప్రాంతాలను గుర్తించడం ద్వారా భవిష్యత్తులో మరిన్ని పరిశ్రమల ఏర్పాటుకు అవకాశం ఉంటుందని, తద్వారా ఆర్థిక పురోగతి లభించగలదని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే ప్రస్తుతం నిర్మితమవుతున్న గృహాలతో పాటు రానున్న రోజుల్లో కూడా మరిన్ని ఇళ్ల నిర్మాణాలకు స్థలం అవసరమవుతుందని పేర్కొన్నారు. ఇందు కోసం ఇప్పటి నుంచే గృహ నిర్మాణాలకు అనువైన ప్రభుత్వ స్థలాలను గుర్తించి సిద్ధం చేసుకోవాలని తెలిపారు. ప్రతి మండలంలో ప్రభుత్వ భూముల వివరాలు ఉంటాయని, వాటిలో గ్రామ కంఠానికి, రహదారికి దగ్గరగా ఉండే స్థలాలకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. భవిష్యత్తులో ఏర్పాటు కాబోయే ఇండస్ట్రియల్ పార్క్, గృహ నిర్మాణాల కొరకు అనువుగా ఉండే ప్రాంతాలను ఇప్పటి నుంచే గుర్తించి సిద్ధం చేసుకోవాలని సూచించారు. రెవెన్యూ శాఖలోని పలు అంశాలపై సబ్ కలెక్టర్లు, తహశీల్దార్లు, సర్వేయర్లతో కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని గురువారం తన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించారు. ప్రజలకు సమస్యల్లేకుండా చేయడమే పిజిఆర్ఎస్ (ప్రజా సమస్యల పరిష్కార వేదిక) లక్ష్యమని, ఆ దిశగా జిల్లా అధికారులంతా కృషి చేయాలని చెప్పారు. తక్షణమే పరిష్కారమయ్యే సమస్యలను పిజిఆర్ఎస్ కిందకు తీసుకొస్తున్నారని, అటువంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సర్వీసెస్ ఫిర్యాదులను కూడా రెవెన్యూ ఫిర్యాదుల కిందకే చూపుతున్నారని, ఇకపై ఆ రెండింటిని వేరుగా చూపాలని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ శాఖకు చెందిన ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయని, జిల్లాలో అటువంటి ఫిర్యాదులు లేకుండా రెవెన్యూ అధికారులు తగు బాధ్యత వహించాలని తేల్చి చెప్పారు. పిజిఆర్ఎస్‌లో వచ్చిన సమస్యలకు సరైన, నాణ్యమైన పరిష్కారం ఇవ్వని కారణంగా, ఫిర్యాదులు మళ్లీ రీ ఓపెన్ అవుతున్నాయని, ఇకపై అటువంటివి పునరావృతం కారాదని ఆదేశించారు. ప్రతి సమస్యకు నాణ్యమైన పరిష్కారం చూపాలని, భూసమస్యలకు సంబంధించి క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని వివరించారు. ఈ దిశగా సబ్ కలెక్టర్లు మరింత చొరవ చూపాలన్నారు.

జిల్లాలో త్వరలో నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలు జరగనున్నాయని గుర్తుచేశారు. ఎన్నికల అనంతరం నీటి వినియోగదారుల సమస్యల పరిష్కారానికి నిధులు అవసరమవుతాయని, అందుకు ఇప్పటినుంచే నిధులను సమీకరించుకోవాలని చెప్పారు. ఇందుకోసం నీటి పన్నులు పెండింగ్ లేకుండా వసూలు చేయాలని, ఆ దిశగా రెవెన్యూ అధికారులు దృష్టి పెట్టాలని సూచించారు. రైతులకు సిసిఆర్ కార్డులు పంపిణీ అయ్యేలా చూడాలని, పంట రుణాలు మంజూరయ్యేలా బ్యాంకర్లతో మాట్లాడాలని సబ్ కలెక్టర్లను కలెక్టర్ కోరారు. రీసర్వే జరుగుతున్న గ్రామసభల తీరుపై వివరాలు అడిగి తెలుసుకున్న కలెక్టర్ రైతుల సమస్యలు అడిగి తెలుసుకొని, వాటిని పరిష్కరించాలని అన్నారు. అలాగే గ్రామసభలు నిర్వహించి మార్పులు, చేర్పులు చేసిన రీసర్వే రికార్డులు పక్కాగా ఉండాలని తెలిపారు. ఆన్లైన్ ద్వారా పట్టాల సబ్ డివిజన్ చేసుకోవచ్చనే విషయాన్ని ప్రజలకు అర్థమయ్యేలా అవగాహన కల్పించాలని విఆర్ఒలను ఆదేశించారు. కోర్టు కేసుల్లేకుండా భూసమస్యలు పరిష్కరించాలని, పాత కేసులను కూడా పరిష్కరించుకోవాలని తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక, పార్వతీపురం, పాలకొండ సబ్ కలెక్టర్లు అశుతోశ్ శ్రీవాస్తవ, యశ్వంత్ కుమార్‌రెడ్డి, డిఆర్ఒ జి.కేశవనాయుడు, పలువురు తహశీల్దార్లు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలకు స్థలాలు గుర్తింపు : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, జెసి, సబ్‌కలెక్టర్లు



పత్తిపంటను పరిశీలిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, నాయకులు

పత్తికి గిట్టుబాటు ధర కల్పించాలి

ప్రజాశక్తి - కురుపాం

పత్తి పంటకు గిట్టుబాటు ధర కల్పించి గిరిజన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని మామిడిమానుగూడ, గుజ్జువాయి, డి.భారామణిలో సిపిఎం శాఖా మహాసభలు గురువారం జరిగాయి. ఈ సభల్లో రెడ్డి వేణుతో పాటు సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.అవినాష్ పాల్గొన్నారు. అనంతరం గిరిజనుల సాగు చేస్తున్న పత్తి, వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 300 మంది గిరిజన రైతులు సుమారు వెయ్యి ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నారని, విత్తనాలు, పురుగు మందులు పెట్టుబడి ఖర్చులకు అప్పులు తెచ్చి పండిస్తున్నారని, గిరిజన రైతులు వేసుకున్న పంటను కంటికి రెప్పలా కాపాడుకుంటూ పండిస్తున్నప్పటికీ గిట్టుబాటు ధర మార్కెట్లో లేక దళారుల పాలై గిరిజన రైతులు దివాలా తీస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కావున మన్యం జిల్లాలో కాటన్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి పెట్టుబడి ఖర్చులు పెరిగినందున పత్తికి క్వింటాలకు రూ.16వేలు గిట్టుబాటు ధర కల్పించి, దళారులు లేకుండా రైతు భరోస కేంద్రాల ద్వారా పత్తిని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు వైకుంఠరావు అంగధ, జోగులు, వాసు, రాము, జ్యోతి, రైతులు పాల్గొన్నారు.

మత్స్య సంపద అభివృద్ధి చెందాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గరుగుబిల్లి

జిల్లా వ్యాప్తంగా మత్స్య సంపద అభివృద్ధి చెందాలని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. మత్స్య శాఖ ఆధ్వర్యంలో గురువారం తోటపల్లి రిజర్వాయర్‌లో దాదాపు ఆరు లక్షల ఫింగర్లింగ్స్ (చేప పిల్లల)ను ఆమె వదిలారు. పది లక్షల చేప పిల్లలను గుమ్మలక్ష్మీపురం మండలం డుమ్మంగి ప్రభుత్వ చేపల పెంపక కేంద్రం నుంచి తీసుకొచ్చినట్టు తెలిపారు. పిఎంఎంవైలో భాగంగా ఆరు లక్షల చేప పిల్లలను తోటపల్లి రిజర్వాయర్‌లో విడిచిపెట్టామన్నారు. మిగిలిన నాలుగు లక్షల చేప పిల్లలను ఇతర నీటి వనరుల్లో విడిచిపెడతామని తెలిపారు. జిల్లాలో చేపల పెంపకం గణనీయంగా పెరగాలన్నారు. మత్స్యకారులు చేపల పెంపకంపై దృష్టి పెట్టాలని సూచించారు. మత్స్య సంపద పెరిగితే ఉపాధి పెరుగుతుందన్నారు. మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మత్స్యకారులకు పూర్తి సహాయ సహకారాలను జిల్లా మత్స్యశాఖ అధికారులు అందిస్తారని పేర్కొన్నారు. ఎస్‌టిల జీవనోపాధికి అవసరమైన చేపపిల్లలు, వేటకు ఉపయోగపడే పరికరాలను ఐటిడిఎ నుంచి మంజూరయ్యేలా ప్రయత్నిస్తామని ఆమె తెలిపారు. చేపపిల్లల ఉత్పత్తి కేంద్రం హేచరీకి తోటపల్లి రిజర్వాయర్ దగ్గరలోనే స్థలం మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. రిజర్వాయర్‌లో మత్స్యకారులు చేపలు పట్టడానికి జిల్లా కలెక్టర్‌తో సంప్రదించి లైసెన్స్‌లు మంజూరుకు కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా మత్స్య శాఖ అధికారి వేముల తిరుపతయ్య, ఎంపిటిసి తోటపల్లి మరదాన, మాజీ ఎంపిపి గరుగుబిల్లి పురుషోత్తం, మాజీ జెడ్పిటిసి అక్కేన మధుసూదనరావు, సింహాచలం, కోటవానివలస మత్స్యకార సంఘం నాయకులు ఈదల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



తోటపల్లి రిజర్వాయర్‌లోకి చేపపిల్లలను విడిచిపెడుతున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

మత్స్యకార సహకార సంఘాలకు చేప పిల్లలు పంపిణీ

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని డుమ్మంగిలో చేప పిల్లల ఉత్పత్తి కేంద్రంలో సర్పంచ్ పాలక క్రాంతికుమార్, ఇరిడి ఎంపిటిసి కద్రక మల్లేశ్వరరావు మత్స్యకార సహకార సంఘాలకు చేప పిల్లలను పంపిణీ చేశారు. పిఎంఎంఎస్‌వై పథకం ద్వారా ఉత్పత్తి చేసిన 10లక్షల ఫింగర్ ల్లింగ్స్ (80-100ఎంఎం) సైజు కట్లా, హెూహు, మ్రిగాల్, చేప పిల్లలను తోటపల్లి జలాశయానికి 6 లక్షలు, డుమ్మంగి కిరండల్ ట్యాంక్ కు 0.33లక్షలు, గుజ్జువాయి మినీ జలాశయానికి లక్ష, వట్టిగెడ్డకు 1.55లక్షలు, జగనాథ్ జలాశయానికి 1.55లక్షలు ఉచితంగా స్టాకింగ్ కార్యక్రమం చేస్తూ పంపిణి చేశారు. కార్యక్రమం లో ఎఫ్డిఒ గోపీకృష్ణ, ఫిషరీష్ అసిస్టెంట్లు వెంగళరాయుడు, సురేష్, డుమ్మంగి కిరండల్ సొసైటీ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

నాలుగేళ్లుగా పూర్తికాని రహదారులు

ప్రజాశక్తి - సీతంపేట

పాలకకొండ నియోజకవర్గం నాలుగేళ్ల క్రితం ప్రారంభించిన కోసంగి, పాలమాను గూడ, గుండెంగి, వంబరెల్లి, డోకూలుగుడ, హుస్సేన్‌పురం, వీరఘట్టం తదితర గ్రామాల రోడ్లు నేటికీ పూర్తి కాలేదని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.తిరుపతిరావు, మండల కార్యదర్శి ఎ.భాస్కరరావు విమర్శలు చేశారు. గత ప్రభుత్వంపై విమర్శలు గుప్పించిన కూటమి నాయకులు ఆ పనులు ఎందుకు పూర్తి కాలేదో సమీక్ష చేసి ఆ పనుల పూర్తికి చొరవ చేయాలని డిమాండ్ చేశారు. ఇవే కాక కుడ్డపల్లి, ఎగువధారబ, పూతికవలస, అంటికొండ, ఈతమానుగూడ, ముత్యాలు, దబర, కుమ్మర గండి, పుబ్బడ, కోతం, కాశీపురం, దోంబంగి వలస, బూర్జిగూడ, రుక్మిణిగూడ వంటి అనేక రహదారులు పూర్తిగా దెబ్బతిని గిరిజనులు రోజువారీ ప్రయాణానికి తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఐటిడిఎ పరిధిలో ట్రైబల్ వెల్ఫేర్, పిఐయు, పిఆర్ తదితర శాఖలు సిబ్బంది ఉన్నా గిరిజనుల వెతలు తీరడం లేదన్నారు. ఇది గిరిజనుల పట్ల ప్రభుత్వానికి ఉన్న నిలువెత్తు నిర్లక్ష్యమన్నారు. మర్రిపాడు పంచాయతీలో ఎగురద్వారా బంధం, దిగువ ద్వార బంధం, నడిమి ద్వారా బంధం గిరిజనులకు తాగునీరు లేక గ్రావిటేషన్‌పై ఆధారపడుతున్నారని, దీనివల్ల రోగాల బారిన పడుతున్నారని అన్నారు. ఇకనైనా పిఒ పాలక వర్గ సమావేశం నిర్వహించి గిరిజనుల అభివృద్ధికి కృషి చేయాలని డిమాండ్ చేశారు.



తాగేందుకు గెడ్డనీరు పడుతున్న భాసూరుకు చెందిన మహిళ

ఈ నీరే వారు తాగేది..

ప్రజాశక్తి - పాలకొండ

పక్కనే విజయనగరం జిల్లాలో గుర్ల గ్రామంలో కలుషిత నీరు తాగి డయేరియా బారిన పడి అనేక మంది మృతి చెందినా ఇక్కడి అధికార యంత్రాంగానికి ఏ మాత్రం పట్టడం లేదు. గ్రామాల్లో స్వచ్ఛమైన నీరందించేందుకు చర్యలు తీసుకున్న దాఖలాల్లేవు. చేసేదేమీ లేక గ్రామాల్లో ఊట నీరు, చలమ నీరు, బావుల నీటినే ప్రజలు సేవిస్తున్నారు. మండలంలో భాసూరులో ఇదే పరిస్థితి వెంటాడుతుంది. సుమారు రెండు వేల జనాభా కలిగిన ఈ గ్రామంలో తాగునీటికి ఇబ్బందులు తప్పడం లేదు. పాలకులు, అధికారులు మారినా ప్రజలకు తాగునీరందించడంలో చర్యలు తీసుకోవడం మాత్రం శూన్యం. గ్రామంలో ఎనిమిది బోర్లు ఉన్నప్పటికీ అందులో రెండు బోర్లు పూర్తిగా మొరాయించాయి. దీంతో ఆ గ్రామస్తులు కొంతకాలంగా ఆ గ్రామంలో ఉన్న గెడ్డ నీటిని తాగుతున్నారు. రక్షిత మంచినీటి పథకం ఏర్పాటు చేసినపట్టికీ ఇన్‌ఫిల్టరేషన్ చేపట్టకపోవడంతో ఆ గ్రామస్తులకు గెడ్డ నీరే ఆధారంగా మారుతుంది. ఈ నీటికి క్లోరినేషన్ ఏ విధంగా చేస్తారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇంత కలుషితమైన నీరు ప్రమాదమని తెలిసినా గ్రామస్తులు ఆ నీరు తాగుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్వచ్ఛమైన నీటిని అందించాలని భాసూరు గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే మరణాలు

- మృతుల సంఖ్యనూ తక్కువ చేసి చూపిస్తున్నారు
- మాజీ సిఎం జగన్మోహన్‌రెడ్డి
- గుర్లలో డయేరియా బాధితులకు పరామర్శ
- మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు చొప్పున ఆర్థికసాయం

ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి/గుర్ల

ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే గుర్లతో పాటు పలు గ్రామాల్లో డయేరియా మరణాలు సంభవించాయని వైసిపి అధినేత, మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్నారు. మృతుల సంఖ్యను ప్రభుత్వం తక్కువ చేసి చూపిస్తోందన్నారు. గుర్లలో డయేరియా బాధిత కుటుంబాలను, మృతుల కుటుంబాలను గురువారం పరామర్శించారు. బాధితులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. మృతుల కుటుంబాలకు వైసిపి అండగా ఉంటుందని, ఒక్కో కుటుంబానికి రూ.2లక్షలు చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని ప్రకటించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ తమ ప్రభుత్వ హయాంలో సచివాలయాలు ఏర్పాటు చేసి గ్రామ స్వరాజ్యం తీసుకొస్తే, వాటిని టిడిపి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందన్నారు. గుర్ల మండలంలో డయేరియా ప్రబలి 14 మంది చనిపోతే దాన్ని కూడా రాజకీయం చేస్తోందన్నారు. వైసిపి హయాంలో ప్రతి గ్రామంలో సచివాలయాలు కనిపించేవని, అక్కడే వివిధ శాఖల వారు పని చేస్తూ కనిపించేవారని, కానీ నేడు ఆపరిస్థితి లేదని అన్నారు. గుర్ల మండలం పెనుబర్తిలో సెప్టెంబరు 20న ఒక వ్యక్తి చనిపోయి తొలి డయేరియా కేసు నమోదైంద న్నారు. అయినా ఎవరూ పట్టించుకోలేదన్నారు. అక్టోబరు 12 వచ్చేసరికి డయేరియా మరింత విజృంభించిందని, గుర్ల, కోట గండ్రేడు, గోషాడ, నాగళ్లవలస, పున్నపురెడ్డిపేట తదితర గ్రామాల్లో డయేరియా ఉధృతమైందన్నారు. అక్టోబరు 19న తాను ట్వీట్ చేస్తే తప్ప, ప్రభుత్వం నుంచి స్పందన లేదని, ఆ తర్వాతైనా ప్రభుత్వం కదిలిందా? అంటే అదీ లేదని అన్నారు. జిల్లా కలెక్టర్ కేవలం ఒకరే చనిపోయాడని తక్కువ చేసి చూపే ప్రయత్నం చేశారని, మంత్రులు, అధికారులు ఎవరూ డయేరియాతో చనిపోలేదని చెప్పే కార్యక్రమం చేశారని అన్నారు. అక్టోబరు 24 వచ్చేసరికి చూస్తే, 14 మంది చనిపోయారని తేలిందన్నారు. రోగులకు కనీసం జిల్లా కేంద్రాస్పత్రికి గాని, పక్కనే ఉన్న చీపురుపల్లి ఆస్పత్రికి గాని తరలించే ప్రయత్నం చేయలేదన్నారు. అంబులెన్సులు ఏర్పాటు చేసి, డయేరియా బారిన పడిన వారిని మెరుగైన చికిత్స కోసం ఎందుకు తీసుకుపోలేదని ప్రశ్నించారు. అందువల్లే గుర్లలో 9 మంది, మండలం మొత్తం 14 మంది మృతి చెందారని, ఇది ప్రభుత్వ వైఫల్యమేనని అన్నారు. సమస్య పెద్దది కావడంతో సిఎం చంద్రబాబు తప్పు ఒప్పుకోక తప్పలేదన్నారు. డయేరియాతో 8 మంది చనిపోయారని చెప్పారని, ఇక్కడికి వచ్చిన డిప్యూటీ సీఎం 10 మంది చనిపోయారని చెప్పారని అన్నారు. ఇక్కడికి వచ్చిన తర్వాత ప్రజలకు కనీసం క్షమాపణ చెప్పి, జరిగిన తప్పును సరిదిద్దలేదన్నారు. చంపావతి నదిలో ఉన్న సమగ్ర రక్షిత మంచినీటి సరఫరా పథకం చంద్రబాబు వచ్చిన తర్వాత, ఈ 5 నెలల్లో కనీసం మెయింటెనెన్స్ రెన్యూవల్ కూడా చేయలేదని అన్నారు. దాని ఫిల్టర్లు మార్చారా? లేదా? కనీసం క్లోరినేషన్ జరిగిందా? అన్న కనీసం ఆలోచన కూడా చేయలేదని అన్నారు. సచివాలయ సిబ్బంది సహాయ, సహకారంతో గ్రామంలో శానిటేషన్ చేయాలన్న ఆలోచన కూడా చేయలేదని దుయ్యబట్టారు. గుర్ల మండలానికి సంబంధించి 345 మంది డయేరియాతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో చేరగా, ప్రైవేటు ఆస్పత్రుల్లో అంత కంటే ఎక్కువగా దాదాపు 450 మంది చికిత్స పొందారని తెలిపారు. ఇప్పటికీ విజయనగరం జిల్లాలో గరివిడి, గజపతినగరం, దత్తిరాజేరు మండలాల్లో డయేరియా కేసులు నమోదవుతున్నాయన్నారు. ఇంకా 62 మంది చికిత్స పొందుతున్నారని తెలిపారు.

ఏదైనా సంఘటన జరిగితే దాన్ని ఎలా డైవర్ట్ చేయాలి? ఎలా కవరప్ చేయాలి? అది అసలు జరగనట్లు ఎలా చూపించాలి? అన్న దిక్కుమాలిన ఆలోచన ప్రభుత్వం చేస్తోందని విమర్శించారు. గ్రామాల్లో పరిస్థితిని మెరుగుపర్చకపోగా, పిహెచ్‌సిలు, విలేజి క్లినిక్‌లు, సిహెచ్‌సిల్లో స్పెషలిస్టు డాక్టర్లను తీసేశారని, వైద్య శాఖలో జీరో వేకెన్సీ పాలసీని తాము తీసుకొస్తే, దాన్ని రద్దు చేశారని అన్నారు. ఆరోగ్యశ్రీని నీరు గార్చారని తెలిపారు. ఇప్పటికైనా డైవర్షన్ పాలిటిక్స్ ఆపి, వాస్తవాలను ప్రజలతో పంచుకుని, వారికి క్షమాపణలు చెప్పి, వారికి సహాయం చేసేందుకు అడుగులు వేయాలని కోరారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలపై ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని నిలదీయాలని అన్నారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు, మాజీమంత్రులు సీదిరి అప్పలరాజు, పి.పుష్పశ్రీవాణి, ఎమ్మెల్సీ పి.సురేష్‌బాబు, మాజీ ఎంపిలు విజయసాయిరెడ్డి, బెల్లాన చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్యేలు కోలగట్ల వీరభద్రస్వామి, బొత్స అప్పలనర్సయ్య, ధర్మాన కృష్ణదాస్, గొర్లె కిరణ్, మాజీస్పీకర్ తమ్మినేని సీతారాం, రెడ్డి శాంతి తదితరులు పాల్గొన్నారు.


సొమ్మసిల్లి పోయిన మహిళకు నీళ్లు తాగిస్తున్న జగన్


రెవెన్యూ సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయచంద్ర

సేవలందించడంలో అలసత్వం వద్దు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ప్రజలకు సేవలందించాల్సిన ఉద్యోగులు విధుల్లో అలసత్వం ప్రదర్శించొద్దని స్థానిక ఎమ్మెల్యే విజయచంద్ర అన్నారు. గురువారం ఆయన స్థానిక తహశీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించారు. ఉద్యోగుల హాజరు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. విద్యార్థులకు అవసరమైన వివిధ ధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యం జరుగుతుందని ఎమ్మెల్యే గుర్తించారు. పెండింగ్‌లో ఉన్న సర్టిఫికెట్లను తక్షణమే పంపిణీ చేసేలా చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. ప్రజలకు ఎక్కడా ఇబ్బందులులేకుండా చూడాలన్నారు. అనంతరం మున్సిపాలిటీ కార్యాలయాన్ని సందర్శించారు. కొత్తగా విధుల్లో చేరిన టౌన్ ప్లానింగ్ అధికారితో పలు విషయాలు చర్చించారు. మున్సిపల్ అధికారులు, సిబ్బంది తాగునీరు, పారిశుధ్యం, వీధి దీపాల నిర్వహణ తదితర పనులు సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. ప్రజలు ఎటువంటి ఇబ్బందులకు గురికాకుండా ఏదైనా సమస్య ఉంటే తక్షణం పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు పాడి రైతుల జిల్లా సదస్సు

ప్రజాశక్తి - సీతానగరం

పాడి రైతుల జిల్లా సదస్సు మండలంలోని పనుకుపేట మిల్క్ సెంటర్లో జరుగుతుందని రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి లక్ష్మ నాయుడు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి రమణమూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సుకు రాష్ట్ర నాయకులు పాల్గొంటారని, కావున పాడి రైతులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

నియోజకవర్గంలోని ముస్లిం సోదరుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ చూపుతానని ఎమ్మెల్యే విజయ్ చంద్ర అన్నారు. గురువారం బైపాస్ రోడ్‌లో గల మసీదులో ఆయన ముస్లింలతో సమావేశమయ్యారు. పలువురు తమ సమస్యలను ఎమ్మెల్యేకి తెలిపారు. అన్ని సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు పూర్తిస్థాయిలో కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అలాగే గత ప్రభుత్వంలో మక్కా వెళ్లేందుకు ఎటువంటి సహాయ, సహకారాలు తమకు ప్రోత్సాహం అందించలేదని పలువురు ముస్లిం పెద్దలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. పాత విధానం ప్రకారం మక్కాను దర్శించుకునేందుకు తగు ఏర్పాట్లు, సహాయ సహకారాలు అందించేందుకు తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు, టిడిపి నాయకులు మజ్జి కృష్ణమోహన్, వెంకటేష్, గుంట్రెడ్డి రవికుమార్, భానుప్రకాష్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

టిడిపి నియోజకవర్గ సమావేశం

ప్రజాశక్తి - సీతంపేట

పాలకొండ నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి క్యాంపు కార్యాలయంలో ఇన్‌ఛార్జి పడాల భూదేవి ఆధ్వర్యంలో మండలంలోని క్లస్టర్, యూనిట్, బూత్ స్థాయినాయకులు, కార్యకర్తలకు సమావేశం నిర్వహించారు. ఈ నెల 26నుంచి టిడిపి ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమం గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు, ఎంపిటిసిలు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.


సిపిఎం జెండాను ఎగురు వేస్తున్న నాయకులు

సాగు భూములకు పట్టాలివ్వాలి

ప్రజాశక్తి - మక్కువ

మండలంలో పేదలు సాగు చేస్తున్న భూములకు తక్షణమే ప్రభుత్వం పట్టాలివ్వాలని సిపిఎం డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని వెంకటబైరిపురంలో సిపిఎం పార్టీ శాఖా మహాసభ గురువారం జరిగింది. తొలుత పార్టీ జెండా ఎగురవేశారు. అనంతరం సిపిఎం జాతీయ ప్రధానకార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొల్లి గంగునాయుడు, వి.ఇందిర మాట్లాడుతూ మండలంలోని వెంకటబైరిపురంలో గిరిజనులు 26 మంది 10 ఎకరాల ప్రభుత్వ భూమిని సాగు చేస్తున్నారని వీరికి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు, అలాగే అధ్వానంగా మారిని మక్కువ-చినబోగిలి, మక్కువ - సాలూరు రోడ్డు పనులు వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పిట్టల సీతారాం, చంటి, చినబాబు, సోమేష్, గోపాల్, గోపి, సీత పాల్గొన్నారు.

సురక్షిత ప్రదేశానికి గర్భిణులు

ప్రజాశక్తి - పార్వతీపురం

దానా తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో జిల్లాలో శిథిలావస్థలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో చేరిన గర్భిణులను సమీప వైటిసిలకు తరలించారు. జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ ఆదేశాల మేరకు డిఎంహెచ్ఒ డాక్టర్ విజయపార్వతి పాత పిహెచ్‌సి భవనాల్లో ఉన్న గర్భిణులను సాలూరు, సీతంపేట వైటిసిల్లో తరలించాలని స్థానిక వైద్యాధికారులను ఆదేశించారు. ఈ మేరకు స్థానిక వైద్యాధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. వైద్యుల పర్యవేక్షణలో గర్భిణులకు తనిఖీలు నిర్వహించారు.

అంగన్వాడీ కేంద్రాలను పరిశీలించిన టాటా ట్రస్ట్ బృందం

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని పనుకువలస, కోస్టువలస, పెంద్రంగివలస, తిట్టేడువలస, మడవలస తదితర గ్రామాల్లో గల అంగన్‌వాడీ కేంద్రాలను టాటాట్రస్ట్ బృందం గురువారం సందర్శించింది. అనుబంధ పోషకాహారం అందుతున్న తీరు, అలాగే నాణ్యతా పరిమాణాలు గురించి గర్భిణీలు, బాలింతలతో వారికి అందుతున్న సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే వారు ఇంట్లో తీసుకుంటున్న ఆహారం, ఐసిడిఎస్ ద్వారా ఇచ్చిన ఆహారం ఏవిధంగా వాడుతున్నారు, ఇస్తున్న మెనూ సరిపోతుందా, ఇంకా ఏమైనా ఇవ్వాలా అన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే అంగన్వాడీకి వచ్చే పిల్లలు చిన్నారులకు రోజు వారీగా పెడుతున్న మెనూలో వంట చేయక ముందు అన్ని రకాల వస్తువుల కొలతలు, వంట అయ్యాక పిల్లలకు పెట్టిన తర్వాత, వారు తిన్నకా విడిచిపెట్టిన ఆహారాన్ని కూడా కొలతలు వేశారు. బృందం వెంట సిడిపిఒ బి.అనంతలక్ష్మి, సూపర్వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.


అంగన్‌వాడీ కేంద్రంలో సర్వే చేస్తున్న టాటా ట్రస్ట్ బృందం సభ్యులు

ఇసుక అక్రమ రవాణా అరికట్టాలి

ప్రజాశక్తి - పాలకొండ

గొట్టమంగళాపురంలో ఇసుక రవాణా సంబంధించి వంతెనకు 500 మీటర్ల దూరంలో హద్దులు ఏర్పాటు చేయాలని మండలంలోని నాగావళి నది సమీపాన ఉండే గ్రామాల నుంచి ఇసుక ఉచితంగా తీసుకువెళ్లిలా చర్యలు చేపట్టి, అక్రమ ఇసుక రవాణా అరికట్టాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణరావు ప్రభుత్వ యంత్రాంగాన్ని డిమాండ్ చేశారు. గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉచితంగా ఇసుక రవాణా చేసుకోవచ్చని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చినప్పటికీ మండలంలో నాగావళి నదికి ఆనుకున్న గ్రామాల్లో దళారీలు అక్రమ ఇసుక వ్యాపారం చేసుకుంటున్నారని, ఆయా ప్రాంత ప్రజలు ఆరోపిస్తున్నారని, సమగ్రంగా పరిశీలించి అక్రమ ఇసుక వ్యాపారాన్నీ అరికట్టాలని అన్నారు. నాగావళి నది గొట్ట మంగళాపురం ప్రాంతం నుంచి ఇసుక తవ్వకాలు పగలు రాత్రి జోరుగా కొనసాగుతున్నాయన్నారు. ఒక వైపు నాగావళి వంతెన అదే సమీపంలో ఉండగా, మరో వైపు రక్షిత మంచి నీటి పథకం ట్యాంక్ అతి సమీపంలో ఉందని స్థానిక ప్రజలు ఆందోళన చెందుతున్నారన్నారు. ప్రభుత్వ అధికార యంత్రాంగం వంతెనకు 500 మీటర్లు హద్దులు ఏర్పాటు చేసి, ఉచితంగా ఇసుక తరలించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేకుంటే స్థానిక ప్రజలతో కలిసి ఆందోళన తీవ్రతం చేస్తామని హెచ్చరించారు.

ఆక్రమణదారులకే అధికారి వత్తాసు

విచారణ అధికారిపై గిరిజనుల మండిపాటు

ప్రజాశక్తి - మక్కువ

మహారాజా అని మనవి చేస్తే మరి రెండు తగిలించు అన్న చందాన ఉంది ఎర్రసామంత వలస రహదారి ఆక్రమణపై విచారణకు వచ్చిన అధికారి తీరు. ఎర్రసామంతవలస ఏజెన్సీ గ్రామానికి చెందిన కొంతమంది నిరుపేద గిరిజనులు వారి ఇళ్లకు వెళ్లేందుకు వీలు లేకుండా, వర్షపు నీరు ఎటువైపు వెళ్లేందుకు మార్గం లేకుండా గ్రామ కంఠం, ఆర్ అండ్ బి రోడ్డులో సుమారు మూడు సెంట్లు భూమిని ఆక్రమించి ఓ ఆసామి వ్యాపార సముదాయాలు (దుకాణాలు) నిర్మించాడు. ఈ విషయమై బాధిత గిరిజనులు ఈనెల 14న కలెక్టర్‌కు ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు గురువారం డిఎల్‌పిఒను విచారణకు అధికారులు పంపించారు. విచారణ నిమిత్తం గ్రామానికి వచ్చి డిఎల్‌పిఒ నేరుగా ఫిర్యాదుదారులను కలవకుండా ఆక్రమణదారుడైన బొక్క వెంకటరమణను కలవడంతో ఆయన లాలూచీపడ్డారని స్థానిక గిరిజనులు ఆరోపిస్తున్నారు. సమస్యను పరిష్కరించకపోగా తిరిగి ఫిర్యాదు చేసిన తమను డిఎల్‌పిఒ భయభ్రాంతులకు గురిచేశారన్నారు. వందల ఏళ్ల తరబడి ఇళ్లు కట్టుకొని నివసిస్తున్న తమను మీ వద్ద ఎటువంటి ఆధారాలు ఉన్నాయి, మీ ఇంటికి సంబంధించిన డాక్యుమెంట్లను తీసుకురావాలని చెప్పి బెదిరించారని గిరిజనులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ అధికారి అయి ఉండి తిరిగి గ్రామస్తులకు ఆర్ అండ్ బి రికార్డులను, గ్రామ కంట భూమి రికార్డులను తీసుకురావాలని నిరుపేద గిరిజనులతో వాగ్వాదానికి దిగడం కొసమెరుపు.


గిరిజనులతో వాగ్వివాదం చేస్తున్న డిఎల్‌పిఒ


ప్రమాణస్వీకారం చేస్తున్న యుటిఎఫ్ మండల నూతన కార్యవర్గ సభ్యులు

యుటిఎఫ్ మండల నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో యుటిఎఫ్ స్వర్ణోత్సవ మండల కౌన్సిల్ సమావేశం గురువారం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మురళీమోహన్ మాట్లాడుతూ ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై యుటిఎఫ్ నిరంతర పోరాటం చేస్తుందని ప్రస్తుత ప్రభుత్వ ఉపాధ్యాయ సమస్యల పట్ల నిర్లిప్తతో ఉన్న మాట వాస్తవంగా కనబడుతుందని ఈ సందర్భంగా చెప్పారు. అనంతరం జిల్లా ఎన్నికల పరిశీలకులుగా హాజరైన ఎన్.శ్రీనివాసరావు, కె.భాస్కరరావు ఆధ్వర్యంలో నూతన కమిటీ ఎన్నిక జరిగింది. మండల శాఖ నూతన గౌరవాధ్యక్షులుగా టి. మధుసూదన్‌రావు, అధ్యక్షులుగా పల్లి శ్రీనివాసరావు, సహాధ్యక్షులుగా ఎ.పోలి నాయుడు, మహిళా సహాధ్యక్షులుగా కె.లక్ష్మి, మండల ప్రధాన కార్యదర్శిగా బి.ప్రసాదరావు, కోశాధికారిగా డివి రమణతో బాటు జిల్లా మండల కార్యవర్గ సభ్యులను కూడా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఎన్నిక అనంతరం ఎన్నిక కాబడిన సభ్యులచే పదవీస్వీకార ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మండలానికి చెందిన పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

12వ పిఆర్‌సి కమిషన్‌ను నియమించాలి

వీరఘట్టం : 12వ పిఆర్‌సి కమిషన్‌ను నియమించాలని కోరుతూ యుటిఎఫ్ డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం మండలంలోని సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు మాట్లాడారు. అలాగే 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని, పెండింగ్లో ఉన్న ఆర్థిక బకాయిలను తక్షణమే చెల్లించాలని కోరారు. అలాగే భాషా పండిత పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, మండల అధ్యక్షులు బోనంగి దుర్గాప్రసాద్, మండల ప్రధాన కార్యదర్శి కురమాన గోవిందరావు, గౌరవాధ్యక్షులు ఎ.స్వామి బాబు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య సమస్యలను సత్వరమే గుర్తించాలి

ప్రజాశక్తి - మక్కువ

ప్రజారోగ్య సమస్యలను సత్వరమే గుర్తించడంపై దృష్టి సారించాలని వైద్యారోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు వైద్య సిబ్బందికి సూచించారు. ఈ మేరకు ఆయన మక్కువ పిహెచ్‌సి, కాశీపట్నం కెజిబివిని గురువారం సందర్శించారు. పిహెచ్‌సిలో ఐరన్ సుక్రోజ్ ఇంజక్షన్లు ఇచ్చిన అనంతరం తల్లీ-బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనంలో ఇంటికి బయల్దేరుతున్న గర్భిణుల ఆరోగ్యస్థితిని పరిశీలించి, తనిఖీల వివరాల గురించి వైద్యాధికారిని అడిగి తెలుసుకున్నారు. పిహెచ్‌సిలో సిబ్బంది హాజరు, ప్రతి రోజూ నమోదవుతున్న ఒపి, ఐపి వివరాలు పరిశీలించారు. జ్వరాలు, డయేరియా తదితర సీజనల్ వ్యాధులతో ఎవరైనా ఆసుపత్రికి వస్తున్నారా అని వైద్య సిబ్బందిని ఆరా తీసి ల్యాబ్ రికార్డులు తనిఖీ చేశారు. ల్యాబ్ పరికరాల పని తీరును అడిగి తెలుసుకున్నారు. పిహెచ్‌సిలో ప్రతి నెలా నిర్వహిస్తున్న సాధారణ ప్రసవాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. పిల్లల టీకా నిర్వహణ శతశాతం ఉందని వైద్యాధికారి తెలపడంతో సంతృప్తి చెందారు. సిబ్బందితో సమీక్ష జరిపి పలు ఆరోగ్య కార్యక్రమాల నివేదికలను పరిశీలించారు. గర్భిణులను త్వరగా గుర్తించడంపై క్షేత్ర స్థాయి సిబ్బంది దృష్టి సారించాలని, ప్రసవం పూర్తయ్యే వరకు హైరిస్క్ గర్భిణీలకు నిరంతరం పర్యవేక్షణ అవసరమని సూచించారు. గ్రామాల్లో ప్రతి వారం నీటి స్వచ్ఛత పరీక్షలు నిర్వహించాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల ఆరోగ్య స్థితి పరిశీలించాలని, పోషకాహారం, ఎదుగుదల లోపం ఉన్న పిల్లలను గుర్తిస్తే ఎన్ఆర్సీలో చేర్చాలన్నారు. సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిగ్రస్తుల ఆరోగ్యాన్ని ప్రతీ నెలా పరిశీలించి ఆరోగ్య వద్ధి చెందేలా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం కాశీపట్నంలో గల కెజిబివిని డాక్టర్ జగన్మోహన్ సందర్శించి ప్రిన్సిపల్, వైద్య సిబ్బందితో సమీక్షించారు. విద్యార్థుల ఆరోగ్య వివరాలపై ఆరా తీసి తరగతుల వారీగా ఎంత మంది విద్యార్థులు రక్త హీనతతో ఉన్నట్లు గుర్తించారు, ప్రస్తుతం ఏ మేరకు హిమోగ్లోబిన్ శాతం వృద్ధి చెందిందినదీ సంబంధిత వివరాలు రికార్డులో పరిశీలించారు. సిక్ రిజిస్టర్, అక్కడ ఉన్న మందుల లభ్యతను, హాస్టల్‌లో ఎఎన్ఎంలు, విద్యార్థుల ఆరోగ్యం పట్ల పర్యవేక్షణ తీరును పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి ఆరోగ్య సమస్యలున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ పరిసరాల్లో పరిశుభ్రత తీరును పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు ఆరోగ్య సూచనలు సలహాలు తెలియజేసారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ఎం.నిఖిల, ప్రిన్సిపల్ నాగరత్నం, సిహెపొ శకుంతల, సూపర్వైజర్స్ నిర్మల, డివి రత్నం, జయగౌడ్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గోగు పంటను క్షేత్ర స్థాయిలో పరిశీలన

ప్రజాశక్తి - సీతానగరం

జాతీయ ఆహార భద్రత పథకంలో భాగంగా మండల వ్యవసాయ అధికారి ఆధ్వర్యాన మండలంలోని రంగంపేట, జనుముల్లువలస, చినంకలాంలో రైతులతో కలిసి గోగు పంటను క్షేత్ర స్థాయిలో గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా గోగు సాగు పద్ధతులను వివరించారు. అదేవిధంగా గోగుసాగులో ఉండే కష్టనష్టాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గోగు ఒక క్వింటాల్ ధర రూ.3600 వరకు ఉందని తెలిపారు. గోగు ఎక్కువగా మెట్ట భూమిల్లో సాగు చేయడమవుతుంది కనుక గోగు పంట తీసివేయడానికి ముందుగా లిమల్టి-కెలి అనేది గోగును నీటిలో వేసే ముందు వేసుకోవడం వల్ల సులభంగా గోగుపై నారను పీకేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో రైతులు, విఎఎలు పాల్గొన్నారు.

సచివాలయాలను సందర్శించిన ఎంపిడిఒ

సీతానగరం : మండలంలోని వెంకటాపురం, లక్ష్మీపురం గ్రామ సచివాలయాలను ఎంపిడిఒ పి.త్రివిక్రమరావు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన సచివాలయ సిబ్బంది హాజరు పట్టికను అంగన్వాడీ కేంద్రాల పనితీరును పరిశీలించారు. అనంతరం చల్లమనడవలస అనంతరం సప్త సంపద కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు వెంకటలక్ష్మి, పీటర్ పాల్, వెంకట నాయుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

28న మహా విజ్ఞాపన దీక్షలు


ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

అగ్రిగోల్డ్ బాధితులు ఈనెల 28న విజయవాడ ధర్నా చౌక్ వద్ద తలపెట్టిన మహా విజ్ఞాపన దీక్షను జయప్రదం చేయాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఇవి నాయుడు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో అగ్రిగోల్డ్ బాధితులు అసహజ మరణాలకు, ఆత్మహత్యలకు గురై మృతి చెందిన వారు సుమారు రాష్ట్ర వ్యాప్తంగా 600మందికిపై చిలుకుఉన్నార న్నారు. గతంలో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అగ్రిగోల్డ్ బాధితులకు మూడు నెలల్లో అందరికీ న్యాయం చేస్తామని మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను నెరవేర్చక మోసం చేసిందని కేవలం రూ.906కోట్లు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం అగ్రిగోల్డ్ ఆస్తులను అమ్మి బాధితులకు న్యాయం చేస్తామని మేనిఫెస్టోలో పెట్టడం జరిగిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడుస్తున్నా ఇంతవరకు అగ్రిగోల్డ్ బాధితుల గూర్చి ఎక్కడా ప్రస్తావన తీసుకుని రాలేదని, ప్రస్తుత ప్రభుత్వం ఆర్థిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని తాము కూడా ఇంతవరకు వేచిచూసే ధోరణిలో ఉన్నామని అన్నారు. ఇప్పటికే వందల సంఖ్యలో అగ్రిగోల్డ్ బాధితులు అనారోగ్యంతో, అసహజ మరణాలతో మృత్యువాత పడ్డారని, ఇంకా మరింత మంది మత్యువాత పడకుండా కూటమి ప్రభుత్వం బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ బాధితులతో ఈనెల 28న విజయవాడ ధర్నా చౌక్ వద్ద తలపెట్టిన మహా విజ్ఞాపన దీక్షకు రాష్ట్రంలోని బాధితులంతా హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షులు ఆర్వీఎస్ కుమార్, అధ్యక్ష, కార్య దర్శులు గెంబలి శ్రీనివాసరావు, సాలాపు అనంతరావు పాల్గొన్నారు..

సేంద్రీయ పద్ధతిలో సాగు

ప్రజాశక్తి - వీరఘట్టం

సేంద్రీయ పద్ధతిలో పంటలు సాగు చేయాలని స్థానిక వ్యవసాయ అధికారి జక్కు సౌజన్య రైతులకు సూచించారు. మండలంలోని చలివేంద్రి, కంబర గ్రామాల్లో పొలం పిలుస్తుంది, పొలంబడి కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ సేంద్రీయ పద్ధతిలో సాగు పంటలు సాగు చేయడం వల్ల భూసారం పెరగడంతో పాటు పెట్టుబడులు కూడా తగ్గుతాయన్నారు. అంతేకాకుండా పంట దిగుబడి కూడా వస్తుందని, ఆ దిశగా రైతులంతా సేంద్రీయ పద్ధతిలో పంటలు సాగు చేసేందుకు ముందుకు రావాలని అన్నారు. అనంతరం కంబరలోని మండల ప్రాథమిక పాఠశాలలో మనబడి, బడితోట కార్యక్రమంలో భాగంగా పండిస్తున్న కాయగూరలు పంటను ఆమె పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో విఎఎలు, యాంకర్ మారుతి సింహాచలం, ఎస్ఎఫ్‌జెడ్ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.


కమిషనర్‌కు ఆస్తిపన్ను చెల్లిస్తున్న సెయింట్ పీటర్ స్కూల్ యాజమాన్య ప్రతినిధులు

ఆస్తి పన్ను చెల్లించి అభివృద్ధికి సహకరించండి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణ పరిధిలో గల ప్రజలు ఆస్తి పన్ను చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ జి.శ్రీనివాసరాజు కోరారు. పట్టణంలో గల ఆర్‌సిఎం, సెయింట్ పీటర్ పాఠశాల మున్సిపల్ కార్యాలయానికి చెల్లించాల్సిన ఆస్తి పన్ను రూ.1,41,737 మొత్తాన్ని నిర్వాహకులు ఆర్ఐ వినయ్ కుమార్ ఆధ్వర్యంలో కమిషనర్‌కు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మున్సిపల్ కార్యాలయానికి చెల్లించాల్సిన ఇంటి పన్నులు, ఖాళీ స్థలాలు, కుళాయి పన్నులు చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని అన్నారు.

పొగతో అనారోగ్య సమస్యలు

ప్రజాశక్తి - సాలూరు

స్థానిక మున్సిపల్ డంపింగ్ యార్డ్‌లో చెత్తను కాల్చడం వల్ల వచ్చిన పొగ కారణంగా శ్వాసకోశ సమస్యలు, ఇతర అనారోగ్య సమస్యలు వస్తున్నాయని శ్రీనివాసా కాలనీ, కామాక్షి నగర్, కార్తీక రెసిడెన్సీ ప్రజలు గురువారం మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణకు ఫిర్యాదు చేశారు. చెత్తలోని ప్లాస్టిక్ వస్తువులు, రబ్బరు టైర్లు తగలబెడుతున్నారని, వాటి నుంచి వెలువడే దుర్గంధ పూరితమైన పొగతో చాలా అనారోగ్య సమస్యలు వస్తున్నాయని చెప్పారు. ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కమిషనర్ సత్యనారాయణ మాట్లాడుతూ పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పోలీసుల అమరుల దినోత్సవం పురస్కరించుకొని వివిధ రకాల పోటీలను పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఎస్ఐ లంక శ్రీనివాసరావు మాట్లాడుతూ పోలీసులు చేసిన త్యాగాలను అలాగే అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించే ఆయుధాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఈ ప్రసన్నలక్ష్మి, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, రవికుమార్, రామారావుతో పాటు పోలీస్ సిబ్బంది రామకృష్ణ, సుజాత, పద్మనాయుడు విద్యార్థులు పాల్గొన్నారు

అత్యాచార ఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలి

ప్రజాశక్తి - కురుపాం

పార్వతీపురంలోని బెలగాంలో గల కురుపాం ఏకలవ్య పాఠశాలలో చదువుతున్న ఇంటర్ విద్యార్థిని అత్యాచార ఘటనపై అధికారులు సమగ్ర దర్యాప్తు చేపట్టి నిందితుడ్ని కఠినంగా శిక్షించాలని గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు అధికారులను, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఈ సంఘటన జరిగి మూడు రోజులవుతున్నప్పటికీ ప్రభుత్వం, అధికారులు కాలయాపన చేయడానికి గల కారణాలేమిటో అర్థం కావడం లేదని ప్రశ్నించారు. నియోజకవర్గ పరిధిలో గల సమస్య కనుక స్థానిక ఎమ్మెల్యే కూడా చొరవ తీసుకొని తక్షణమే నిందితుడ్ని కఠినంగా శిక్షించేలా అధికారులతో మాట్లాడాలని, అలాగే బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే బాధిత కుటుంబం పక్షాన నిలబడి న్యాయం జరిగే వరకు గిరిజన సంఘం తరపున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

పెదపెంకిలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని పెదపెంకిలో గురువారం పారిశుధ్య పనులను స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి క్రాంతి కిరణ్మయి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఫైలేరియా వ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి కావాల్సిన వైద్య సదుపాయాలందించేందుకు సిద్ధంగా ఉన్నామని వైద్యాధికారి తెలిపారు. అనంతరం గ్రామంలోనే కాలువల్లో దోమల లార్వా అభివృద్ధి చెందకుండా దోమల నివారణ మందులను చల్లారు. ఫైలేరియా వ్యాధిగ్రస్తులకు పాడైపోయిన శరీర భాగాలను ఏ విధంగా శుభ్రపరుచుకోవాలో, ఆ వ్యాధి మిగతా భాగాలకు ఏ విధంగా ఇతరులకు సోకకుండా ఎలా జాగ్రత్తపడాలో రోగులకు అవగాహన కల్పించారు. అవసరమైన, అత్యవసరమైన వైద్యం కోసం అందుబాటులో తమ సిబ్బందితో సిద్ధంగా ఉంటామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ నగిరి పాపారావు, గ్రామ పెద్దలు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.